ట్రైనెట్ న్యూస్
https://trinetnews.com/
తాజా తెలుగు వార్తలు
ప్రతి 3 గంటలకు
7 AM TO 10 AM
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
98497 67747 | 9494184136
సంపుటి: 01 / సంచిక:27 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శనివారం, సెప్టెంబర్ 12,2026

## విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్.. రూ.180 కోట్లు విడుదల చేసిన

# తెలంగాణ సర్కార్



- విదేశాల్లో చదివే విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల
- మొత్తం 3,008 మంది విద్యార్థులకు రూ.179.9 కోట్ల కేటాయింపు
- మైనారిటీ విద్యార్థులకు అత్యధికంగా రూ.76.1 కోట్ల విడుదల
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో ఆర్థిక శాఖ చర్యలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కూడా నిధుల పంపిణీ పూర్తి

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు.

ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

# నిర్మాణ రంగం ఢమాల్..

## కాంగ్రెస్ గద్దెనెక్కినప్పటి నుంచీ గడ్డుకాలం..

## అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల బంద్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12 :

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగానికే కాదు.. దాని అనుబంధ రంగాలకూ గడ్డుకాలం మొదలైందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ వచ్చిన వెంటనే టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులపై ఆంక్షలు విధించిందని, కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. పైగా అప్పటికే పూర్తయిన ప్రాజెక్టుల్లోకి కొనుగోలుదారులు వెళ్లనీయకుండా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను సైతం నిలిపివేసింది. తర్వాత హైడ్రా, మూసీ ప్రాజెక్టు తెరమీదికి రావడంతో రియల్ ఎస్టేట్ రంగానికి గుండెకాయ వంటి జీహెచ్ఎంసీ పరిధిలో అమ్మకాలు, కొనుగోళ్లు కుప్పకూలాయి.

### కొత్త ప్రాజెక్టులు బంద్

టీజీబీపాస్ అనుమతుల నిలిపివేత, పూర్తయిన ప్రాజెక్టులకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల నిలిపివేతతో కొత్త భవనాలు లేక, కట్టిన భవనాలను కొనుగోలు దారులకు అప్పగించలేక రియల్టర్లు, నిర్మాణ సంస్థలవారు లబోదిబోమంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కలిపి నెలకు కనీసం 30 వరకు హైరైజ్ బిల్డింగ్‌లకు అనుమతులిచ్చేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నాలుగు నెలల్లో 10 లోపే హైరైజ్ బిల్డింగ్‌లకు అనుమతులు ఇచ్చిందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జీహెచ్ఎంసీకి గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.300 కోట్ల మేర ఆదాయం పడిపోయింది. 2022-23లో 13,748 భవన నిర్మాణాలకు అనుమతులివ్వగా, రూ.1,454 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24 నాటికి 2,456 మాత్రమే అనుమతులు వచ్చాయి. ఫలితంగా ఆదాయం రూ.1,107 కోట్లకు పరిమితమైంది. దాదాపు రూ.300 కోట్లు నష్టపోయినట్టు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనుమతులు నిలిపివేయడంతో నష్టం భారీగా ఉన్నదని జీహెచ్ఎంసీ వర్గాలు చెప్తున్నాయి. ఫలితంగా పది నెలల్లో ఒక్క బడా ప్రాజెక్టు కూడా ప్రారంభం కాలేదు.

### హైడ్రా, మూసీ పిడుగు.. ఫోర్త్‌సిటీ ఫెయిల్

మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా హైడ్రా, మూసీ ప్రాజెక్టులు తమ మీద పడ్డాయని రియల్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హైడ్రా భయంతో



చెరువుల చుట్టూ ఉన్న భవనాలు, వెంచర్ల దిక్కు చూసేవారే కరువయ్యారని అంటున్నారు. మూసీ ప్రాజెక్టు మ్యాపులు విడుదల చేసిన తర్వాత ఆ పరిధిలోని నిర్మాణాలన్నీ ఆగిపోయాయని చెప్తున్నారు. అడ్వాన్సులు వెనక్కి ఇవ్వాలని క్యూ కడుతున్నారని వాపోతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మరీ బడా ప్రాజెక్టులు అక్రమమని చెప్పడంతో మరో పిడుగు పడ్డట్టయ్యిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం నగరంలో రియల్ నిర్మాణ రంగాల వృద్ధికి ప్రోత్సాహం ఇవ్వకపోగా, ఫోర్త్ సిటీ నామాన్ని జపించింది. ఎంత ప్రచారం చేసినా ఫోర్త్ సిటీవైపు రియల్టర్లు దృష్టిసారించక పోవడంతో హైడ్రా, మూసీని తెరమీదికి తెచ్చారనే ఆరోపణలున్నాయి. బ్రహ్మాండమైన నగరం కడుతామంటూ ప్రచారం చేసి, ఒత్తిడి చేసి ప్రాపర్టీ షోలు పెట్టి మరీ అటువైపు కృత్రిమంగా బూమ్ సృష్టించాలని ప్రయత్నించారని చెప్తున్నారు.



## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్!..

### క్రియాశీలకంగా మారాలని సూచన

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

: మంత్రివర్గం నుంచి బర్త్ఫ్ అయిన కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ ఫోన్ చేసి మా ట్లాడారు. అంతర్గత విభేదాలు, వ్యక్తిగత కారణాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి క్రియాశీలకంగా మారాలని కొండా సురేఖకు సూచించినట్టు తెలిసింది. సురేఖ మంత్రివర్గం నుంచి బర్త్ఫ్ అయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు.పార్టీ అధిష్ఠానం నుంచి స్పష్టమైన సూచనలు రావడంతో, ఇకనుంచి అసెంబ్లీ సమావేశాలకు కొండా హాజరవుతారా? లేదా? అన్న అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.

# అల్పపీడనం ఎఫెక్ట్..

## తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు!

### ఉత్తర, తూర్పు జిల్లాలపై అధిక ప్రభావం

### హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శని, ఆదివారాల్లో (సెప్టెంబర్ 12, 13) రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.దక్షిణ ఒడిశా తీరం, వాయవ్య-పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి, పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా విదర్భ వైపు వెళ్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం: భట్టి

## రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన చేయబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతామంటూ ...

హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు12:

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన చేయబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతామంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కేంద్రప్రభుత్వం దగ్గర సంతకం చేసిందని ఆయన ఆరోపించారు. మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో భట్టి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఉదయ్ పథకం కింద త్రైపాక్షిక ఒప్పందం చేసుకుందని చెప్పారు. మరోవైపు, రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని భట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, దేశంలోనే తొలిసారి రూ.కోటి వరకు ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు భట్టి పేర్కొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# అల్పపీడనం ఎఫెక్ట్..



దీని ప్రభావం రాష్ట్రంలో సెప్టెంబర్ 14 వరకు ఉంటుందని, ముఖ్యంగా 12, 13 తేదీల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల 50 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో ప్రభావం తక్కువగా ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడొచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30–32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23–24 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షాలు ఊరటనిచ్చే అంశమైనప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఉండరాదని హెచ్చరించారు. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. సెప్టెంబర్ 15 నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

# విదేశీ ఉద్యోగులకు అమెరికా షాకిస్తుంటే..

## గుడ్‌న్యూస్ చెప్పిన దుబాయ్.. ఉద్యోగం వెతుక్కోవడానికి బంపరాఫర్!




త్రినేట్ న్యూస్, సెప్టెంబరు12

విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారికి అమెరికా వీసా నిబంధనలు కఠినతరంగా మారుతున్న సమయంలో.. దుబాయ్ మాత్రం ఉద్యోగార్థులకు ఆసక్తికరమైన అవకాశం కల్పిస్తోంది. జాబ్ ముందుగానే కన్ఫార్మ్ కాకపోయినప్పటికీ.. దుబాయ్‌కి వెళ్లి అక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కునే అవకాశం కల్పించింది. ఈ మేరకు జాబ్ సీకర్ వీసాను అందుబాటులో ఉంచింది. సాధారణంగా విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లాలంటే ముందుగానే కంపెనీ నుంచి ఆఫర్ లెటర్, స్పాన్సర్ లేదా ఉద్యోగ సంబంధిత అనుమతులు అవసరం అవుతాయి. అయితే యూఏఈ జాబ్ సీకర్ వీసా విషయంలో అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా ఉద్యోగం పొందకుండానే దుబాయ్‌కు వెళ్లి స్థానిక లేబర్ మార్కెట్‌లో ఉద్యోగ అవకాశాలను నేరుగా వెతుక్కోవచ్చు.

### దుబాయ్‌లోనే ఉండి.. జాబ్ వేట

ఆన్‌లైన్‌లో దూరం నుంచే ఉద్యోగాలకు దరఖాస్తులు పంపడం కాకుండా.. దుబాయ్‌లోనే ఉండి కంపెనీలను సంప్రదించడం, ఇంటర్వ్యూలకు హాజరు కావడం, రిక్రూటర్లను కలవడం, తమ రంగంలో ఉన్న సంస్థలతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవడం ఈ వీసా ద్వారా సాధ్యమవుతుంది. జాబ్ సీకర్స్ తమ అవసరానికి అనుగుణంగా 60, 90 లేదా 120 రోజుల వీసా వ్యవధిని ఎంచుకునే అవకాశం ఉంది. నిబంధనలు, అనుమతులకు లోబడి కొన్ని సందర్భాల్లో దీనిని 180 రోజుల వరకు పొడిగించే అవకాశం కూడా ఉంటుంది. అమెరికాలో విదేశీ ఉద్యోగుల వీసాల విషయంలో నిబంధనలు, పరిశీలనలు కఠినతరం అవుతున్న నేపథ్యంలో.. యూఏఈలో ఉద్యోగ అవకాశాలను అన్వేషించాలనుకునే వారికి ఈ విధానం ఆకర్షణీయంగా మారుతోంది. ముఖ్యంగా టెక్నాలజీ, ఫైనాన్స్, హాస్పిటాలిటీ, నిర్మాణం, ఇతర ప్రొఫెషనల్ రంగాల్లో తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని భావించే వారికి అక్కడి మార్కెట్‌ను నేరుగా పరిశీలించే అవకాశం లభిస్తుంది. అయితే జాబ్ సీకర్ వీసా అంటే ఉద్యోగం గ్యారంటీ కాదు. దుబాయ్‌లోకి వెళ్లేందుకు, ఉద్యోగం వెతికేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది కానీ ఉద్యోగ నియామకం మాత్రం అభ్యర్థి అర్హతలు, కంపెనీ అవసరాలు, నియామక ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది.

# కీలకబిల్లుల ఆమోదానికి పార్లమెంట్ ప్రత్యేక భేటీ!

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని స్కూళ్లనే టార్గెట్ చేస్తున్న సీ

న్యూఢిల్లీ, త్రినేట్ న్యూస్, సెప్టెంబరు12



కీలకమైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్ మళ్లీ ప్రత్యేకంగా సమావేశమవుతుందని అధికార వర్గాలు చెప్పాయి. ఈ వర్షాకాల సెషన్‌లోనే ప్రత్యేక భేటీ నిర్వహించే అవకాశాలు ఇంకా ఉన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. వర్షాకాల సమావేశాలు ప్రోరోగ్ కాకపోవడమే దానికి కారణమని పేర్కొన్నాయి. ప్రత్యేక సమావేశం వద్దని ప్రభుత్వం భావిస్తేనే ప్రోరోగ్ చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. బ్రిక్స్ సదస్సు తర్వాత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. ఒకవేళ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావిస్తే అది శరన్నవరాత్రుల సమయంలో ఉండొచ్చని, మహిళా శక్తికి సంకేతంగా భావించే దుర్గా పూజ సమయంలో మహిళా బిల్లు ఆమోదించవచ్చని ఆ వర్గాలు అంచనా వేశాయి. 131వ రాజ్యాంగ సవరణ బిల్లులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టగా, ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లుకు కావాల్సిన మూడింట రెండొంతుల మెజారిటీ పొందలేకపోయిన విషయం తెలిసిందే. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడానికి లోక్‌సభలో 360మంది, రాజ్యసభలో 164 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ఇటీవల మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆ నంబర్లకు చేరువైంది. పశ్చిమబెంగాల్లో అధికారం చేపట్టి బీజేపీ బలపడింది. అలాగే డీఎంకేకు చెందిన 22 మంది లోక్‌సభ ఎంపీల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తోంది.

# డ్రైవింగ్ లైసెన్స్ కావాలా?..

## రెండున్నర గంటల వీడియో కోర్సు పూర్తి చేయాల్సిందే!

తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ జారీకి కొత్త నిబంధనలు

తప్పనిసరిగా ఆన్‌లైన్ వీడియో కోర్సు పూర్తి చేయాల్సిందే

కోర్సు అనంతరం ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే లైసెన్స్

కూకట్‌పల్లిలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

త్రినేట్ న్యూస్, సెప్టెంబరు12

తెలంగాణలో ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ పొందడం అంత సులువు కాదు. రహదారి భద్రతను పెంచి, ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రవాణా శాఖ కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రెండున్నర గంటల వీడియో కోర్సు పూర్తి చేసి, ఆ తర్వాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. లెర్నర్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈ ఆన్‌లైన్ కోర్సులో పాల్గొనాలి. మొత్తం రెండున్నర గంటల నిడివి గల ఈ కోర్సును 25 నిమిషాల చొప్పున 6 మాడ్యూల్స్‌గా విభజించారు. ఇందులో 64 రహదారి భద్రతా నియమాలు, ప్రాక్టికల్ డ్రైవింగ్ పాఠాలు ఉంటాయి. అభ్యర్థి మోసాలకు పాల్పడకుండా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో పర్యవేక్షిస్తారు. ప్రతి మాడ్యూల్ తర్వాత ఒక క్విజ్, మొత్తం కోర్సు పూర్తయ్యాక తుది పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో పాసైతేనే రెగ్యులర్ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు అర్హత లభిస్తుంది. ఇప్పటికే ఈ విధానాన్ని కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. అక్కడ సుమారు 3,400 మంది ఎల్ఎల్ఆర్ దరఖాస్తుదారులు ఉండగా, వారిలో 2,800 మంది ఈ కోర్సును పూర్తి చేశారు. ఈ విజయంతో మరో 30 నుంచి 45 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో, ఆ తర్వాత రాష్ట్రమంతటా అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్ట్రేలియా, యూకే, అమెరికా వంటి దేశాల్లోని ఉత్తమ విధానాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ కోర్సును రూపొందించారు.

# గుజరాత్ తీరంలో

# రెండు వాణిజ్య నౌకలు ఢీ..

## రంగంలోకి దిగిన తీర రక్షక దళం

గాంధీనగర్, త్రినేట్ న్యూస్, సెప్టెంబరు12

గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవు సమీపంలో రెండు వాణిజ్య నౌకలు ఢీకున్నాయి. శుక్రవారం రాత్రి ఎంవీ ట్రూ మారినర్ వాణిజ్య నౌక, ఎంవీ కేమ్యాక్స్ ఎంపీరర్ వాణిజ్య నౌకలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదం నుంచి 21 మంది నౌకా సిబ్బందిని రక్షించామని భారత తీర రక్షక దళం శనివారం వెల్లడించింది. వారిని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలిపింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో నౌకలో 24 మంది ఉన్నారని పేర్కొంది. నౌకలో కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు ముగ్గురు నౌకలోనే ఉండిపోయారని వివరించింది. నౌకలు ఢీకొనడం వల్ల చమురు లీకయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎలాంటి కాలుష్య సమస్య ఉత్పన్నమైనా.. వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. సముద్ర భద్రతతోపాటు గుజరాత్ తీరప్రాంత పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. అందుకోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌తోపాటు కేంద్ర ఏజెన్సీలతో కలిసి పని చేస్తున్నట్లు భారత తీర రక్షక దళం ప్రకటించింది.



edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136